

# ఇల్వలుని వారసులు

''యెవరండీ నిన్న వచ్చిన శాల్తీ? తల్లి వేపా, తండ్రి వేపా?'' అనడుగుతూ, పళ్లు కనబడేట్టు నవ్వుతూ పొద్దున్నే పొద్దుపొడవక ముందే, రెండు అగ్గిపుల్లలూ, పాత అగ్గిపెట్టెవుంటే అదీ యివ్వమంటూ వచ్చింది సుజీ. పక్కనే యిల్లు చిన్న భాగంలో వున్నది. రెండు గదులే. వరండా, లెట్రిన్, బావీ కామన్. వేళాపాళా లేకుండా వచ్చి యేదో డిమాండ్ చేయటం ఫాషన్. ఇల్లల్లా తిరుగుతూ, కొబ్బరి చిప్పగానీ, ముక్క గానీ, అల్లం, వెల్లుల్లిపాయా, నీరుల్లి, కరివేపాకు, కొత్తిమేరా, మాచిపత్రి, మరువం, తులసీ, క్రోటన్సు ఆకులూ, నిమ్మ చెక్క, దబ్బాకు, అరిటాకు కోసివ్వమని గానీ, గన్నేరు, మందార పూజకు, నిత్యమల్లె విచ్చకపోయినా తుంపటం చేస్తుంది. వుయ్యాల్లో పసిపాపని చూసి, నట్టింట కూచుని బిస్కట్ కొరుకుతున్న చిన్నారినీ, చెడ్డీ యెక్కించుకుంటున్న బాబునీ గుడ్లు పెట్టుకు చూసివెళ్లే శాల్తీ నేమనాలీ? ష్యూర్ థింగ్ యిల్వలుని వారసురాలు.

''తండ్రివేపే. మొదటి పెత్తండ్రి. ఇలాటివాడు చాలాకాలం మన్నడులే'' అని దీవించి వెళ్లాడు జబ్బుగావున్న మా అన్నను. ఆయన దీవన నిజమైంది.'' అన్నది అనూ మంచాలు యెత్తుతున్నది.

''అదేం రోగం?'' అనడిగింది తలతాటిస్తూ సుజీ.

''రోగంగాదది. రక్త దోషం. యిల్వలుని రక్తం'' అన్నది చీపిరి తేవటానికి వెళ్తూ అనూ.

''వాతాపి అన్ననేనా పేర్కొన్నావు? అగస్త్యుడు వాతాపిని అరిగించుకుని యిల్వలుని వదిలేశాడెందుకనో?''

దొడ్లోకి దారి తీసిన సుజీ సైకాలజీ కొద్దిగా యిల్వలునిదే. దోపిడీ వేరే పద్ధతి. చంపే బదులు విడదీస్తుంది.

పమిట కొంగు దోపి, సేకరించినవి దానిలో కూరి, మైత్రి వెల్లడిస్తూ నవ్వుతూ లోపలికొచ్చింది సుజీ.

అగ్గిపుల్లలు అగ్గిపెట్టె అందిస్తూ అనూ, సుజీ పమిట కొంగు చూస్తూ దానిలోవి తొంగిచూస్తుంటే నవ్వుతూ చూస్తున్నది. ఇల్లు చిమ్ముతున్నది. వాకిట్లో ముగ్గు వేయటం అయింది.

''మహర్షి వదిలేయలేదు. ఇల్వలుడే ఐపు లేకుండా పారిపోయాడప్పుడే. దేవుడు దయాసింధు కదూ! వానికీ సంతానమిచ్చి, వారసులుండేట్టు చూచాడు. తండ్రి ఆకాశమంతపాడవని శుకయోగి భాగవతంలో చెప్పాడు చూడండీ. వాని స్వభావం వ్యాపిస్తూనే వుంటుంది'', అన్నది అనూ.

అనూ భర్త రాధాక్రిష్ణ పాప్యులిస్టు. ''కావాల్సినవి కోసుకోనీ పాపం. అడిగిందిచ్చి పంపేయి'' అని వత్తాసు పలుకుతాడు. అదీ సుజీ ధైర్యం.

2

సర్పలత టూరిస్ట్ గైడ్‌గా జాబ్ సంపాయించాలని ''టూర్ చేస్తూ వుండచ్చు. వాగుతూ, పనికొచ్చేవారిని గుర్తించవచ్చు అదీ లాభం'' అని ట్రై చేస్తే బస్తాడు సర్టిఫికేట్లు ప్రొడ్యూస్ చేయాల్సి వచ్చింది. విసుగు జెందకుండా అన్నీ సేకరించింది. చివరిది హెల్త్ సర్టిఫికేట్. పరీక్షలు చేయించుకుని రిపోర్ట్ పట్టుకుని ఫిజిషన్ ఆదిశేషయ్య కన్సల్టేషన్ రూమ్ కెళ్లి, బల్లమీద రిపోర్టుంచి సంతకం కావాలన్నది సర్పలత.

శేషయ్య మర్యాదలు చెల్లించి కూచోమన్నాడు. రిపోర్ట్ చదివాడు. వినోదమిచ్చిందా రిపోర్టు.

పైతృకంగా యిల్వలుని రక్తం యీమెకు సంక్రమించింది. మరే అంటువ్యాధులు, హృద్రోగమూ, కేన్సరూ లేవు. ఈ దోషం యీ మధ్య యువతీయువకుల రక్తంలో కనబడుతున్నది. ఆ మాటకొస్తే, పెద్దవారిలోనూ యేజింగ్ అండ్ మిడిలేజ్డ్ వారిలోనూ యిది కనిపిస్తున్నది. తరుచూ సంపర్కం వల్లా రావచ్చు. యీ దోషం బ్రెయిన్‌లో కొన్ని సెల్సు వూడిపోతే, కసి పెరుగుతుంది. చెప్పేది తల్లో కెక్కదు. క్యూర్‌కి అవకాశమున్నది.

ఆదిశేషయ్య సర్పలత వంక చూచాడు. ఎర్ర తాచులాగా మెరుస్తూ

కనిపించింది విచిత్రంగా. ఇందుప గింజలంటి కళ్లలో మెరుపు. ఆమె పెదిమలు తడుపుకునేందుకు నాలుక బైటబెడితే రెండునాల్కలలాగా కనిపించింది. సంతకం చేసి పత్రం అందిస్తే, నూరునోటు బల్లమీదుంచింది లేచి వెళ్లిపోయింది.

శేషయ్య డ్రాయరు సొరుగుతాళం తిప్పి సొరుగులాగి ఫీజు లోపల పడేసి సొరుగునెట్టి తాళం తిప్పి తలెత్తేప్పటికి, యెదురుగా మరో యువతి నిలబడి వున్నది. అడుగుల చప్పుడు వినరాలేదే అనుకుని,

''యేం కావాలమ్మా? హెల్త్ సర్టిఫికేట్ మీద సంతకమా? కన్సల్టేషన్ కోసమా? రిపోర్ట్సు తెచ్చావా?''

''సంతకం కోసం రాలేదు డాక్టర్. మీరు నాతో రావాలి. వాహనం తెచ్చాను. మనిషిని చూపిస్తా. ఆ స్వభావం మార్చే మందున్నదా చెపితే చాలు. మందు లేదనుకోండి డాక్టర్, ఆ మనిషిని భరించే మార్గమన్నా చెప్పాలి. నేర్పుగా పంపేసినా మళ్లా ప్రత్యక్షమగును. మీరు సైకలాజికల్ సలహా గూడా యిస్తారని విన్నాను'' అన్నది. రంగు రుచీ, వాసన లేని వంటనూనెలాగా వున్నదా తీరూ చూపూ.

''కన్సల్టేషన్ రూమ్ మూసే వేళ కాలేదమ్మా యింకా. వెయిట్ చేస్తావా?'' అంటూ గోడవేపు చూశాడు డాక్టర్.

అనాలోచితంగా స్నేహలతా నిలబడే చూసిందా వేపు.

''ఇంటికి వస్తే ఫీజు, వాహనం తేకపోతే వైద్యుని వాహనంలో వెళ్తే చోదకునికి ఫీజు పదిరూపాయలు. వేచివుంటే కాఫీ యివ్వాలి. గంటకు పదిరూపాయలివ్వాలి'' అనే గిల్టు అక్షరాలు చదివిగూడా నవ్వలేదు స్నేహలత. డాక్టర్ని చూసి తలూపింది. కూచోమన్నాకే కూచున్నది.

మరో యువకుడొచ్చాడు. ఇరవై యిరవై అయిదు మధ్య వుంటుంది వయస్సు. కోల ముఖం. ఆరోగ్యంగా వుండటమేగాక నల్లని పట్టులాంటి జుట్టు, కొత్తగా వచ్చిన మీసకట్టు, గడ్డం పెంచాడు. చెంపలకతికే వున్నది.

''కూచోండి'' అన్నాడు శేషయ్య.

''థాంక్యూ'' అంటూ పాంటు నలగకుండా పట్టుకుని కూచున్నాడు. తెల్లని చేతులు

''కన్సల్టేసన్ కోసమేనా'' అనడిగాడు శేషయ్య.

''అఫ్‌కోర్స్ డాక్టర్! టైమ్ చాలక రిపోర్ట్ తేలేదు. ఇంకా ఎంగేజ్‌మెంట్సున్నాయి. మీ టైమాటే వేస్టు చేయను. నేను లేటెస్టు వాహనం తెచ్చాను. నేనో చోదకుడిని. నా లైసెన్సు సర్వీస్ బుక్ చూపుతా కావాలంటే'' అలా అంటూ గోడమీదివి చదివాడు. ''మీరు నాతో రావాలి''.

డాక్టర్ నవ్వురాబోతుంటే ఆపేయటం గమనించాడా యువకుడు. ''నవ్వెందుకొస్తున్నదో'' అనుకున్నాడు.

''యేమి చేయగలనని నమ్ముతున్నావు మిస్టర్! ఈ రోజుల్లో అలా నమ్మి వెళ్లటం అంత శ్రేయస్కరం గాదు. ఎబ్డక్షన్, వైలెన్సూ, అర్థం లేని కసీ చూస్తున్నాం. కనీసం పేరూ, వూరూ, జాబూ, చిరునామా, ఐడియా తెలుసుకోవాలి'' అన్నాడు డాక్టర్.

''అఫ్‌కోర్స్ డాక్టర్. యూ హావెరైట్. టేలాఫ్ టు సిటీస్‌లో లాగా, డాక్టర్నెత్తుకుపోయి బందీని చేస్తామని అనుమానిస్తున్నారేమో. మేము కన్సర్వేటివ్ కాదు. మీకు తోడుగా, యీ అనామికా రావచ్చు. నా పేరు లతీఫ్ శర్మ. మేము యంగ్ మెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఆల్ రెలిజియన్స్ నడుపుతున్నాము. మా అమ్మ మతం మారింది. చేయగలిగిన పద్ధతిలో మానవసేవ చేయటమెలా అని మీటింగులు పెట్టి చర్చలు చేసీ ఒకరి ఆలోచనలొకరితో చెప్పుకునీ, వ్రాయగలిగిన వారుంటే నాటకం వ్రాయించి, అమెచ్యూర్ నాట్యమండలి అని నడుపుతున్నాము. ఆడిస్తాము మంచి నటకులచేత ఫండ్స్ కలెక్ట్ చేయగలిగిన వారు చేస్తారు. ట్రస్టున్నది. సెక్రెటరీ, ట్రెజరరూ, షరాబూ యేజెంటూ, ప్యూనూ, క్లీనరు, వాచ్‌మన్ వున్నారు. ఆనెస్టీ యీజ్ ది బెస్ట్ పాలసీ అని నేర్పుతాము. పిక్‌పాకెటర్సునీ, బేవార్సుగా తిరిగి అల్లరి మూకగా మారుతున్న బొట్టికాయల్ని తెచ్చి హోమీ వుండి చదివిస్తాము. స్వయంకృషి విలువ చెప్పుతాము. ఇంకానేమో డాక్టర్! వైలెన్సు నిర్మూలించాలనీ, శాంతియుత హెలికాప్టర్ యాత్రలు చేస్తాము'' అన్నాడుద్రేకాన్ని అణిచిపెడుతూ.

అతడలా చెప్తుంటే వింటూ, మరో యిద్దరు తెచ్చిన రిపోర్ట్స్ చదివి స్క్రిప్ట్ చేసి సంతకం చేసి, ఫీజు అందుకుని సొరుగులో నెట్టి తాళం తిప్పి నిలబడగానే మరో కొత్తమొహం నిలబడి వున్నదెదురుగా. డాక్టర్ ఆశ్చర్యపోయాడు.

'' ఇవాళ తెరిపి లేకుండా కన్సల్టేషన్ కోసం వస్తున్నారే!'' అనుకుంటూ టైమ్ చూశాడు. టిక్ టిక్మనే శబ్దం వినబడేంత నిశ్శబ్దంగా యువతరం.

''సాయంకాలం అయిదింటికి రావచ్చు మిస్టర్. వీరంతా వెయిట్ చేస్తున్నారు. వెంట వెళ్లాలిట. లంచ్టైమ్కి తెచ్చేస్తామంటున్నారు. సాయంకాలం కన్సల్ట్ చేతువుగాని'' అంటున్నాడు డాక్టర్.

''నో. నో. డాక్టర్ నాది యెమర్జన్సీ కేసు. అదుగో చూడండి ఆ మైదానంలో హెలికాప్టర్ ఆపి పరుగెత్తుకొచ్చాను. వీరందరూ రావచ్చు. నేనే దింపుతా తెచ్చి. మనిషిని చూడటమే. మీరు సైకాలజీ ప్రొఫెసరుగా, సైకియాట్రిస్టుగా గూడా కొన్నాళ్లు ప్రాక్టీస్ చేశారని విన్నాను. కొంతమందిని దారినబెట్టి మానవులుగా మర్చారనీ విన్నాను. దానవులను మానవులుగా అంతా మార్చలేరు. ఇదుగో నా లైసెన్సు. టైం వేస్టవుతున్నది'' అంటూనే తనను అనుసరించమని రిక్వెస్టు చేస్తూ వీధి గుమ్మంవేపు వెళ్లాడు ఫిరోజ్.

మొహాలు చూసుకున్నారు. ''పోదాం డాక్టర్! దింపుతానంటున్నాడు. మిస్టరీ యేమిటో తెలుసుకుందాం. ప్రమాదిస్తే అంతా ఓసారే పోతాం'' అని దారితీసింది స్నేహలత. అసిస్టెంట్ తలవూపటం చూసి డాక్టరనుసరించాడు యువతరాన్ని.

3

నిర్మలమైన సరస్సులో హంస వెళ్తున్నట్టు హెలికాప్టర్ ఆకాశవీధిలో వెళ్తున్నది. అందరికీ బైనాకులర్స్ అందించాడు హరికిషేన్. అతను లతీఫ్ శర్మ ఫ్రెండ్. న్యూ యెరైవల్స్ మొత్తంగా చౌకగా కొని అసలు ధరకి అమ్ముతాడు నేర్పుగా. యేమైన పనికావాలంటే చేసిపెడతాడు. ఆక్టింగ్ జాబ్స్ చేస్తూ వుంటాడు. కాషియర్, సర్వర్, కుక్కి హెల్పర్ డ్రైవర్ అలా. అతని వెనకే వున్న బిషంబర్

వీడియో ఫిల్మ్ తీస్తున్నాడు. రైల్వే ట్రాక్‌కి పారలల్‌గా వెళ్తున్నది హెలికాప్టర్.

రైలు గమ్యం చేరబోతూ హుషారుగా కూతలేస్తూ వస్తున్నానని చెపుతూ, పొగ వదుల్తూ లయబద్ధంగా చప్పుడు చేస్తూ పోతున్నది. రైల్వే ట్రాక్‌కి యిటూ అటూ పొలాల గట్ల మీద, ఖాళీ ప్రదేశంలోనూ, సన్నని పంటకాలవ గట్టునా నిలబడి చూస్తున్నారు పనివారు. పొద్దుపులు ముగిసినై. ఇంటికి పోవాలి కూలీ అందుకుని. రైలు చక్రాల వంకా, వాటిని కదిపే యంత్రం వంకా, రైలు వదిలే ఆవిరి వంకా చూస్తూ వినోదిస్తున్నారు.

ఒకడు గద్దలాగా యెక్కడినించో వూడిపడి, గురి తప్పకుండా రైలు పెట్టెమీద నాటు బాంబు విసిరి, రివ్వున గద్దలాగే పారిపోయాడు. లిప్తకాలంలో బోగీ అంటుకుని అగ్ని ప్రయాణిస్తున్నట్టు కనబడి అరుస్తూ కూలీలు పరుగెత్తారు. కొద్దిదూరం పోయి రైలాగింది. తలుపుతీసి ప్రాణాలరచేతబట్టుకుని దూకేశారు ప్రయాణీకులు. దూకే అవకాశంలేని ప్రయాణీకుల దుస్తులంటుకుని కాలిపోయారు. లోపలంతా మంటలు. కొనవూపిరితో వున్నవారిని కూలీలు పెట్టెలోంచి దింపి నేలమీదుంచారు. తక్కిన పెట్టెలలోని వారూ సాయమొచ్చారు. సెల్‌ఫోనున్నవారు సహాయం కోసం ఫోన్ చేశారు. రైల్వే అధికారులొచ్చి పడిపోయిన పెట్టెను తొలగించి, మిగిలిన రైలును కనెక్ట్ చేసి గమ్యం వేపు పోనిచ్చారు. అంబులెన్సులతో వైద్యులు వచ్చారు. కాలినవారినీ, గాయపడినవారినీ కొనవూపిరున్నవారినీ అంబులెన్సుల్లో చేర్చి తీసికెళ్లారు.

హెలికాప్టర్ చక్కర్లు కొట్టి మరోవేపు వెళ్లింది.

ఒక ప్రభుత్వ వాహనంలో ఒక మంత్రీ ఆయన అనుయాయులూ వెళ్తున్నారు. ఎలెక్షన్ ప్రాపగాండా మీటింగూ, ఆడపిల్లల బడికి ప్రారంభోత్సవం, పండిత సన్మానం ముగించి వెళ్తున్నారు. రెండు వాహనాలు రక్షణశాఖతో ముందు వెళ్తున్నాయి. వెనక రెండు ప్రభుత్వ వాహనాల్లో సిబ్బంది వస్తున్నది. దుశ్శకునాలన్నా కంటబడలేదు. క్షణంలో మందుపాతరపేలి ముందు వాహనాలు పైకెగిసి కిందబడి అగ్నిగోళాలైనై.

సడెన్‌బ్రేక్స్ పడి వెనుక వాహనాలాగిపోయినై. మొత్తం పన్నెండుమందిని ప్రతిఫలాపేక్ష లేకుండా పరమపదం పంపారు యిల్వలుని వారసులు.

చుట్టుపక్కల వూళ్లనించి ప్రజలు పరుగెత్తుకొచ్చారు. వార్తలందగానే ప్రథమ చికిత్స చేసి తీసికెళ్లటానికి వైద్య సిబ్బందీ, అంబులెన్సులూ వచ్చాయి.

వీడియోలో చిత్రం బిగిసింది. హెలికాప్టర్ చక్కర్లాపి మరోవేపు వెళ్లింది. పొగమంటలూ యేడ్పులూ వినలేక చూడలేక నోళ్లు దెరిచి కళ్లు మూసుకుని చెవులలో వేళ్లు పెట్టుకున్నారు హెలికాప్టర్‌లోని ప్రయాణీకులు.

కంసమహారాజుని కాలగర్భంలోకి నెట్టారు ఇల్వలుని వారసులు.

గ్రామీణులు శరవేగంతో పరుగెత్తి కొంతమంది వారసులను పట్టుకోటం ఫిల్ములో కెక్కింది.

హెలికాప్టర్ యింటి ముఖంపడితే బాగుండుననిపించింది. ఇంకేమీ చూడాల్సి వున్నదోనని భయపడ్డారు.

బన్, ఫ్రూట్ సాలడ్, ఐస్ క్రీమ్‌తో నిండిన కప్పులు అందించబడ్డాయి. హంసలాగా మబ్బుల మధ్య పోతున్నది హెలికాప్టర్.

రాత్రి కటిక చీకటిలో పోలీస్ స్టేషన్ పేల్చి విలువైన గుళ్లు తుపాకులు యెత్తుకపోవటం చిత్రంలోకెక్కింది.

సర్పంచ్ బయటకు రాగా వానిని పేల్చి చంపి మనుషుల్ని గుర్తుపట్టకుండా జాగర్తపడ్డారు వారసులు.

సన్నని జల్లు మొదలైంది.

కింద యేదో వాగులేక కాలవ లేక నది. ప్రయాణీకులతో సరుకులతో వెళ్తున్న పడవలను పేల్చేశారు వారసులు. వారి నేరమేమి? నిద్రవేళ.

గుళ్లపరంపరతో వాచ్‌మన్ నేలకూలాడు. బాంక్ దోపిడీ.

4

ఆనాడింకా యెవరూ కన్సల్టేషన్‌కి రాలేదు. అసిస్టెంటు అంతా నీట్‌గా సద్దుతున్నాడు. ఈకల బ్రష్‌తో దులుపుతూ లోపలికెళ్లాడు.

డాక్టర్ ఆదిశేషయ్య ఆధ్యాత్మిక మాసపత్రిక ఒకటి పేజీలు తిప్పుతూ అక్కడ కూడా యింటరెస్టింగా వున్నచోట, కొత్త విషయం కనబడిన చోట చదువుతున్నాడు. కొత్తవేమీ లేవు. శుకయోగి భాగవతం పరీక్షిన్మహరాజుకి వినిపిస్తూ మృత్యుభీతి పోగొట్టేందుకు చెప్పిన వినోదాత్మక విషయాలే అవి. కర్మయోగం అనువాదం అనవసరం యిప్పటికే చాలా వున్నాయి. స్త్రీలూ పద్యరూపేణా, గద్యరూపేణా అనువదించారు. ఇంకానేమో సయనాతన మేనమామ ఆంధ్రగీతా తేటగీతికలు అని అనువదించాడు. మూడుపాకాల్లోనూ వున్నాయి. ద్రాక్షాపాకం, కదలీపాకం, నారికేళపాకం అనుకుంటుండగా ''నమస్తే డాక్టర్!'' అని వినబడి పత్రిక బల్ల మీదబడేసి లేచి నిలబడి.

''నమస్తే. అలా కూచోండి'' అని కూచున్నాడు.

వాళ్లు సుఖాసీనులయ్యారు.

తొమ్మిది కాలేదింకా. వానలు లేవు. తీవ్రమైన యెండలు. ఉక్క. ఫాను పనిచేస్తున్నా చెమటలు.

''గుర్తున్నామా డాక్టర్! పరిచయం చేసుకోవాలా? వీళ్లిద్దరు నా మిత్రులు. వీరూ తెలుసు మీకు. మనతో ఆకాశయానం చేశారు. వైలెన్స్ చూసి మీకు స్పృహ తప్పకుండా భద్రతలు తీసుకుంటూ ఫీడ్ చేశారు''.

''గుర్తున్నారు'' అన్నాడు శేషయ్య.

రిపోర్ట్సు అందించగా అందుకున్నాడు.

''జిజ్ఞాస జాస్తి. కొన్ని చదివినా అర్థం గావు. తెలుసుకోవాలని ఆసక్తి ఆరాటం. వీటికి మందున్నదా? పరిష్కరించగలమా? అని మథన. యే వుద్యోగమూ స్థిరంగా చేయలేక పోతున్నారు. స్థిరత లేదు. సమర్థతున్నది. డిగ్రీలున్నాయి. క్యూరబుల్''.

శేషయ్య పక్క వాకిలి వంక చూస్తే అసిస్టెంటు మూడు కోలా సీసాలు ఓపెన్ చేసి స్ట్రా వేసి ట్రేలో వుంచి తెస్తూ కనిపించాడు. పాతికేళ్ల వయస్సు పేరు లలిత్. ట్రే వాళ్ల ముందుంచి లోపలికెళ్లిపోయాడు.

శేషయ్య ఆలోచిస్తూ రిపోర్ట్సు చూస్తుంటే వాళ్ళ కోలా సీసాలందుకున్నారు.

''యెలా క్యూర్ అవుతాయంటారు డాక్టర్? కొల్లలుగా యజ్ఞయాగాదులూ జరుగుతున్నాయి శాంతి కోసం పాదయాత్రలూ సభలూ జరుగుతున్నాయి. వలంటరీ సంఘాలు వైలెన్సును రూపుమాపాలనీ, శక్తి మేరకు కంట్రోల్ చేయాలనీ శ్రమిస్తూ, ఆశ్రమాలు స్థాపించి నడుపుతూ, ఆధ్యాత్మిక పత్రికలు ప్రచురిస్తూ వుచితంగా పంచుతూ, మానసిక పరివర్తనకు, స్థిరతకూ యోగా క్లాసెస్సూ నడుపుతున్నాయి. కాని దారుణాలూ, వైలెన్సు పెచ్చురిల్లుతూనే వున్నది. యెంతగా అనాలంటే సెప్టెంబరు పదకొండున జరిగిన విధ్వంసానికి ప్రతీకారంగా, అగ్ర రాజ్యమే, టెర్రరిజాన్ని అణిచివేయాలనే మారుపేరుతో దారుణానికి తలపెట్టింది. కూడగట్టింది. తోడ్పడమన్నది. వ్యాధికి మూలకారణమన్నా తెలియాలి, డాక్టర్. వీలుంటే ఔషధమున్నదా చెప్పండి డాక్టర్!'' అన్నాడు వ్యథభరిత స్వరంతో. రెండవ యువకుడు గిరీష్ విచారంగా చూస్తూ అన్నాడు. ''దారుణమైన వ్యాధులకు మూలం కనిబెట్టి ఔషధం కనిబెట్టి మానవత చూపారు వైద్యులు. బహూకరింపబడ్డారు. ఫేమస్ అయినారు. మశూచి, కలరా, ప్లేగ్, టైఫాయిడ్, న్యూమోనియా, మలేరియా, క్షయ వంటి వాటికి మందులు కనిబెట్టారు. కొన్నిటికి వాక్సిన్ గూడా కనిబెట్టారు. భద్రతలూ నేర్పారు. వైలెన్సుకీ విరుగుడు కనిబెట్టరా?'' అనడిగాడు.

మూడో అబ్బాయి నరుసూ అడిగాడు.

''మూలకారణం చెప్పగలరా డాక్టర్? రాస్ దొర మలేరియాకి దోమకాటు కారణమని నిరూపించాడు. దోమనూ చూపాడు. నివారణా చెప్పాడు. వాల్సెస అనే దొర క్రిములు వూపిరితిత్తులో దూరి, గాలి ద్వారా ప్రవేశించి టిబి తెస్తున్నాయని నిరూపించటమేగాక, అజూయర్స్ అనేచోట ఒక మంచి నీటికొలనులో తేలే నాచుతో ఔషధం చేసి టిబి క్యూర్ చేయచ్చునీ, ఒక వూపిరితిత్తే పాడైతే శస్త్ర చికిత్స చేసి దానిని తీసివేసి రోగిని బతికించవచ్చునీ, ఒక లంగ్ చాలుననీ

నిరూపించి మానవులకు మహోపకారం చేశాడు. ఈ వుగ్రవాదుల రోగానికట్టి ఔషధాలు కనిబెట్టి మానవత చూపేవారు లేరా'' అన్నాడు కళ్లు కర్ఛీఫ్‌తో అద్దుకుంటూ.

ఆదిశేషయ్య వారి అమాయకత్వాన్నీ, అజ్ఞానాన్నీ గ్రహించి జాలిచెందాడు. వూరడింపుగా అన్నాడు. ''మీ ఆవేదన  అర్థం చేసుకున్నాను. మీరు వుద్రేకపడుతున్నారు. పెద్ద మాటలు వాడుతున్నారు. కొంత చరిత్ర చదవాలి. ఫిలాసఫీ ప్రపంచం తీరు తెన్నులూ అర్థం కావాలి మీకు. ముందు నిగ్రహం అలవరచుకోవాలి అదీ మందే. అనాది నించీ వుగ్రవాదులున్నారనీ, అమ్మవారు వారిని తుడిచి వేసి రమ్మని తన పదిగోళ్లనించి పది అవతార పురుషులను సృష్టించి పంపిందని దేవీస్తోత్రంలో వున్నది. మేరీ మాత గూడా ప్రపంచంలో పెరిగిపోతున్న వైలెన్సును తుడిచి, దయా ప్రేమా ప్రాపగేట్ చేసిరా అని జీసస్‌ని సృష్టించి భూమి మీద వదిలిందనీ గాథ. త్రేతాయుగంలో టెర్రరిస్టులను, వైలెన్సునూ అరికట్టటానికే రామరావణ సంగ్రామం అనే ఔషధం వాడబడింది. ద్వాపరంలో అంతఃకలహాలూ టెర్రరిజం, యిగో పెరగటం చూసిన కృష్ణుడు కంసుని యిగో దింపేసి, పెద్దయాక పెద్ద మందే, అరేబియానించి చైనా వరకుభారత యుద్ధం అనే ఔషధం కనిబెట్టి వైలెన్సునీ, టెర్రరిజాన్ని కంట్రోల్ చేశాడు. అవి మరీ పురాతన విషయాలు. తథాగతుడు హింసా, దోపిడీ, వంచనా, తుడి చేసి ప్రేమా దయా అని నేర్పుతూ, శాంతి నెలకొల్పాలని సోషల్ రినైజాన్స్ తెచ్చి సమానత్వాన్ని ప్రాపగేట్ చేశాడు.

మరోవేపు యూదు పండితులు టెర్రరిజం యుద్ధాలు ఆపి సర్వమానవ సమానత తేవాలని క్రిస్టియానిటీ తెచ్చారు. దయా ప్రేమా యిలా వుండాలని డెమాన్‌స్ట్రేట్ చేయటానికే జీసస్ సిలువనెక్కాడు. వారేమి చేయుచున్నారో వారికి తెలియదు క్షమించు అని అడిగాడు.

మహమ్మద్ ప్రవక్త గూడా, స్త్రీల దుస్థితి, మానవులలో అజ్ఞానం మూఢ నమ్మకాలు, అర్థంలేని ఆచారాలు చూసే, యిస్లామ్ లేవదీశాడు. అల్లా ఒక్కడే.

ఒక్కటే మతం ఒకటే కులం. దయ, అహింస, స్త్రీలకు సమాన హక్కులు. యెవరినైనా యిస్లామ్‌లో చేర్చుకోవచ్చు. భేదభావం హింసా ప్రవృత్తీ రూపుమాపాలనే ప్రవక్త ఐడియా. యెలాగో పోతాడని తెలిసీ చూస్తూ వూరుకోక వుపశమనానికీ, వూరటకీ, నిన్ను ప్రేమించే వారున్నారని తెలియజేయటానికీ ప్రయత్నిస్తాం. ఎయిడ్స్ వ్యాధి వంటిదే వైలెన్సు. ఆ వ్యాధి నిర్మూలనకీ, కనీసం ట్రీట్‌మెంట్‌కీ, శాయశక్తులా ధనసేకరణ చేసి, ఔషధం కనిబెట్టమనీ, జబ్బు యెలా సోకేదీ సామన్యులకీ తెలిసేట్టు ప్రాపగాండా చేయమనీ వెచ్చిస్తూనే వున్నాము.

ప్రాచీనకాలంలో అగస్త్యమహర్షి యిల్వలుని హడలగొట్టి తోలేస్తే, వైలెన్సుతగ్గిపోయిందనుకున్నారు బాటసారులు. కాని నేడు వైలెన్సు పంజా విసురుతునే వున్నది. ఆ దారుణాలు చేసే వారు వారి ఐడియా వారే చెప్పలేక, ''చేసిందీ లేదు, బావుకున్నదీ లేదు'' అని వాపోయారు.

తనకాశ్రయమిచ్చి, దాచి కాపాడి తిండి పెడుతున్న మానవుడినే ఆ వచ్చే రైలులో వచ్చేవానిని ఆ రైలు పేలి, విధ్వంసమయేట్టు పట్టాల మధ్య టైమ్ బాంబు బిగించి వచ్చి యేం చేశాడో తెలిసి, ''నేను మానవుడినేనా ఆ వుదారునికి నెరదాతకు కష్టజీవికి గంపెడు పిల్లలు. వారికి నా నైజం నా నడవడి తెలియక, ''అన్నా'' అని పిలుస్తూ కౌగలించుకుంటున్నారు. అర్థం లేని పనిచేశాను'' అని స్మృతి కోల్పోయాడా టెర్రరిస్టు యువకుడు.''

ఈ సోది విసుగెత్తి ''యేమంటున్నారింతకు డాక్టర్? యీ నడిపే ఆశ్రమాలూ, చేసే యజ్ఞయాగాదులూ యే వంతెన కింద ప్రవహించే నదిలో కలిసి కొట్టుకు పోతున్నాయీ?'' అని దీర్ఘం తీశాడో శ్రోత.

అతన్ని నవ్విద్దామని ఆదిశేషయ్య'' అవన్నీ వుపశమనానికి చేస్తున్నారు. ఇంకా చమత్కారంగా చెపితే అవీ ఒకరకమైన వ్యాపారాలే. మనకెన్ని రకాల వ్యాపారాలొచ్చాయీ! పబ్లిసిటీ అన్నా తప్పులేదు. ఒకబ్బాయి ''రస్సెల్ యేమంటున్నాడూ?'' అని ప్రశ్న పంపితే ఎడిటరుగారు, ''యేమనటం లేదూ రస్సెలనేవాడొకడున్నాడని చాటుకుంటున్నాడు'' అని చమత్కరించాడు. ఒక

డాక్టరమ్మ కుటుంబ నియంత్రణ అవసరం మీద పొత్తము వ్రాయమంటే, తత్త్వవేత్తలాగా, ''మునుపు, యుద్ధాలూ, ప్రకృతి వైపరీత్యాలే అంటువ్యాధులే జనాభాను కంట్రోల్ చేసేవి. వైద్యం, రవాణా, ఔషధాల సాయంతో వాటినెదిరిస్తూ జనాభా పెంచాము. కనక యిపుడు కుటుంబ నియంత్రణ పద్ధతులు తెలుసుకుని, నేర్చి, జనాభాను కంట్రోల్ చేయుట మన కర్తవ్యము. నూతనత్వాన్ని ఆహ్వానించటం నాగరికత. కుటుంబ నియంత్రణ పద్ధతులు నేర్చుకోండి. ప్రపంచాన్ని వుద్ధరించండి'' అని బర్త్ కంట్రోల్ పద్ధతులు వ్రాసింది. జాతీయ పిత యింకా మంచి పద్ధతి చెప్పారు. ''నలభైయవ యేటనించీ బ్రహ్మచర్యం పట్టండి. స్త్రీలు పురుషుల నెదిరించాలి. ప్రమాదాలుండవు''.

దుర్గాప్రసాద్ అడిగాడు. ''సారాంశమేమిటి డాక్టర్! యేమీ చేయలేమనేనా? యేదో చేయాలని ఆరాటం ఆపుకునేదెలా డాక్టర్? కనీసం యెందుకలా హింసాకాండలు దారుణాలు జరిపి టెర్రర్ సృష్టిస్తారో అదన్నా తెలుసుకోవాలి'' అని ఆవేదన వెల్లడించాడు.

''చేసేందుకు పనేమిలేక, ఫ్రస్టేట్ అయి చేస్తారు. ఒక్కోసారి లూర్ చేయబడి, అధర్మాన్నెదిరిస్తున్నామనే భ్రమలో పడి, చేసిన స్నేహాల ప్రోత్సాహంతో చెప్తారు. అన్యాయం భరించాలా అనుకుని చేస్తారు. జర్మనీ కష్టనష్టాలు భరించలేక మొదటి సంగ్రామం తెచ్చింది. కాని ఓడిచేసుకున్న సంధిలో మళ్ళా అన్యాయం. మేధావులే అన్నారు. 'సంధి బాగా లేదు. మళ్ళా ప్రపంచ సంగ్రామం వస్తుంది'' అని సంఘర్షణ వల్ల యుద్ధాలొస్తాయి అన్నాడు నియంత వ్యాపారంలో లాభాలు లేవు. అధికారం లేదు. దారిద్ర్యము, ఆకలి, నిరుద్యోగము, అణచబడివుండటం యివి ప్రేరేపించగా రెండవ ప్రపంచ సంగ్రామం మొదలైంది. తొమ్మిదేళ్ల వీరవిహారం చేశాడు నియంత. మొదట్లో దాన్ని సామ్రాజ్యవాదుల యుద్ధం అనుకున్నారు గానీ, నియంత మాస్కో వరకు వెళ్లాక అది ప్రజాయుద్ధమే. వలసలు సంపాయించాలని చేస్తున్నారు అనుకున్నారు.

రక్తదోషం వల్లా దారుణాలు చేస్తారు. ఇల్వలుని వారసులు వారు.

నిరపరాధులను నిస్సహాయులనే గదూ యిల్వలుడు చంపి దోచాడు. హింస వల్ల కొంతమందికి ఆనందం కలుగుతుంది. కోడంట్రికంపెట్టి అత్త గర్వించినట్లు.

రష్యా పడిపోయిందని కొందరంటే, ఒక నటుడు ''రష్యా పడిపోనూ లేదు. కమ్యూనిజమూ యెక్కడికీ పోలేదు. మనమధ్యే వున్నది. పరిశీలిస్తే కనబడుతుంది'' అన్నాడు. మునుపు బందిపోట్ల అయిడియా ''రాబ్‌ది రిచ్ అండ్ ఫీడ్‌ది పూర్'' అది అధర్మంగాదనే వారి అభిప్రాయం.

ఓసారి హింస పైకొస్తుంది. మరోసారి అహింస గెలుస్తుంది. బలిచక్రవర్తి దే చెప్పాడు. '' ఓసారి మనం గెలుస్తాము. మరోసారి దేవతలు గెలుస్తారు. అదే హరిమాయ''.

''మీరు రిపోర్ట్ చూడకుండా యిల్వలుని వారసులను గుర్తించగలరా డాక్టర్'' అనడిగాడు గుణశేఖర్.

''మీరూ గుర్తు పట్టచ్చు. వీడియో చిత్రాలున్నాయి'' అంటుండగా తెర తొలగించి పక్క గదిలోనించి అసిస్టెంటు వచ్చి నిమిషాల మీద అన్నీ అరేంజ్ చేయగా దూరదర్శన్ మీద చిత్రం పరుగెత్త సాగింది. మళ్లా అసిస్టెంటు వచ్చి ఆడియన్సు ముందు బల్లమీద, సాఫ్ట్ డ్రింక్, కాఫీ, స్నాక్సు ట్రేలో వుంచి వెళ్లాడు. సరిగా అర్థం కావాలని ఆదిశేషయ్య మధ్య మధ్య రన్నింగ్ కామెంటరీ నడిపాడు.

'' ఆరోపణలు చేస్తూ, తెలిసీతెలియని వయస్సులో వున్న పిల్లల మనసులు విషాక్తం చేసున్నవాడు, వ్యర్థ జీవితం గడుపుతూ పరాన్నం తినేవాడు, పైవాడుగాదు బంధువే. కుటుంబాలనాదుకుంటున్న ఆ బ్రెడ్ విన్నర్‌కి సయానా బ్రదరిన్లాయే. ''నీవట్లు చాకిరీ చేయనక్కర లేదు. నౌకర్లున్నారు. చాకిరీ నౌకర్లు చేయుదురు. నీవు నౌకరువుగాదు. ఆస్తి గుండాన బడితే నేమి? ఇన్‌లావే నిన్ను గౌరవముగా చూడవలెను. పెద్ద చదువు చదివించవలెను. నీ ఖర్చులన్నీ భరిస్తూ మేపవలెను'' అలా విషాక్తం చేశాడు వీలున్నచోటల్లా వీలున్నప్పుడల్లా. లాడెన్ చూడండీ పనిగట్టుకునెళ్లి ''ముస్లిమ్ లేమీ తీసిపోలేదు. యూరోపియన్సూ అమెరికనులూ తాము చాటుకునేంత గొప్పవారేమీ కాదు. వారి మతమూ పైనించి వూడిపడలేదు.

ముస్లిములూ శ్వేతజాతికేమీ తీసిపోలేదు. ఒకనాడు ఒట్టామన్ ఎంపైర్ వ్యాపించి యీ జాతి నేలింది. ముస్లిములను చిన్న చూపు చూస్తున్నారు. కించపరుస్తున్నారు. వారి మీద నిఘూపెడ్తున్నారు. అన్ని రంగాలలోకి రానీయటం లేదు. ఆంక్ష లెక్కువైనై. దాష్టీకం పెరిగింది. వీరికి బుద్ధి చెప్పాలి'' అని బాగా దుర్బోధలు చేసి మదరసాలను కలుషితం చేసి, సెప్టెంబరు నాటి విధ్వంసానికి పథకం వేసి జననష్టం ధననష్టానికి  కారకుడైనాడు. ముస్లిముల పరిస్థితి యింకా అధ్వాన్నమైంది. ఒకమ్మాయికి తల్లిపోగా దిగులుపడి, వుపవాసాలూ వ్రతాలూ, దైవధ్యానం చేసి చేసి దైవానుగ్రహం వల్ల కట్నంతో నిమిత్తం లేకుండా తెలివిచూపి, చాలా నిరాడంబరంగా పెళ్లి జరిపించుకున్నది తండ్రి చేత. అత్తింటికెళ్లి భర్తకనుకూలంగా వున్నది. ఈ యిల్వాలుని వారసుడు, పనిగట్టుకుని, వారింటికెళ్లి, కొత్త అల్లుని మనసు కలుషితం చేశాడు.

''నీ భార్యపేర దాని తండ్రి పదివేలు ఫిక్సడ్ డిపాజిట్ వేశాడు. అయిదువేల భీమా పాలసీ వున్నది. నీవేల మన్నుదిన్న పామువా? నీ అంత వాడివి నీవు. వెళ్లి నీ హక్కు ప్రకటించి, నీ భార్యకు చెందవలసినవన్నీ, తల్లి నగలు, సారె తెచ్చుకొనవలెను'' అని వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేట్టు చేసి వచ్చాడు. అల్లుడు మామను జలగలాగా పట్టాడు.

మళ్లా ఇంటరెస్టింగా, గ్రిప్పింగా చిత్రం నడిచింది. బాంబులు విసిరినట్టూ, మందుపాతరలు పెట్టినట్టూ, నిశ్చయమైన పెళ్లిళ్లు పడగొట్టేవారూ, సయానా చెల్లికి ద్రోహం తలపెట్టు వాళ్లూ, అక్కమీదా అక్క కూతురు మీదా అభాండాలు వేసేవారూ కాపరాలు గడ్డలు చేసేవారూ, తరిమి తరిమి మనుషుల్ని పీక్కుతింటూ నెత్తిన చేయిపెట్టాలని ట్రై చేసేవారూ బుద్ధి చెప్పేవారి బోధలు బూడిదలో పోసిన పన్నీరైంది. చిత్ర విచిత్రమైన వైలెన్సు చూచారు యువతరం. లంచ్ టైమైందని గోడ గడియారం గుర్తు చేసింది. ''తెలిసీ యెందుకు మెత్తబడి వెంటవెళ్తారు డాక్టర్!'' గోడవేపు చూస్తూ  '' పే చేస్తారు గనక '' అన్నాడు డాక్టర్.

ఆ రోజున కన్సల్టేషన్ మీద వచ్చిన బిల్స్‌ని సొరుగులోకి నెట్టి తాళం బిగిస్తున్న ఆదిశేషయ్యను

''సపోజ్ డాక్టర్! యిల్వలుని వారసత్వాన్ని డిజోన్ చేయాలనే బలీయమైన కోరిక గలిగిందనుకోండి డాక్టర్ యేదైనా మందున్నదా?'' అనడిగింది కన్సల్టేషన్‌కి వచ్చిన విమల.

''వాగ్గేయకారుడు గానం చేశాడు గదా విమల్!'' సులభముగా కడతేరను సుజనులను తెలియజేసే'' దుస్సాంగత్యం త్యజించాలి. అదే మందు''.

''దుస్సాంగత్యమని గుర్తించటమెలా?''

''మోసపోయి నష్టపోయి వ్యధకలగగానే తెలుస్తుంది''.

''థాంక్యూ డాక్టర్!'' అంటూ ఫీజు అందించి విమల వెళ్లిపోయింది సేతురాము లోపలికొచ్చాడు.

''హలో సేతూ! చిరకాల దర్శనం అలా కుర్చీలో ఆసీనుడవుకా. శలవుమీదొచ్చావా మనదేశం? నిన్ను గురించి వార్తలే అందలేదు. నేను మా తండ్రిగారి పేర నర్సింగ్ హోమ్ పెట్టి నడపాలనే వుద్దేశంతో ధనార్జనలో తలమునకలైనా'' అన్నాడు శేషయ్య డాక్టర్.

గది వాకిలి వంక చూస్తే, అసిస్టెంట్ ఛిల్డ్ బీర్ ఓపెన్ చేసి ట్రేలో వుంచి, పక్కనే అందమైన గాజు కప్పు వుంచి వెళ్లిపోయాడు. టైం పదకొండు.

''కొత్త విశేషాలున్నాయా? అలా వున్నావేం? నీవు మనదేశం వదిలేప్పుడు, హుషారు, సంతోషం, ఆత్మస్థైర్యం, ఆరోగ్యం, వెల్లడించింది నీ ముఖారవిందం. నవ్వు మొహం పెట్టటానికి ప్రయత్నిస్తున్నట్టు కనబడుతున్నావిప్పుడు. అది సేవించు. ముఖానికి వర్చస్సు వస్తుంది. దంతం రంగు కాదే నీది. మెరుపు. చాలా యెత్తుపల్లాలు దాటిపోతూ స్వదేశంలో స్వంత వూరిలో స్వగృహం లేవదీశావని మేస్త్రీ దేవుడమ్మ చెప్పాడు. వాడే నా పనిచూస్తున్నాడిప్పుడు రియల్‌మాన్ అనుకున్నాను'' శేషయ్య తానే కప్పులోకి పానీయం వంచి అందించాడు అతిథికి.

''నన్ను మరిచిపోకుండా చూడవచ్చావు సేతూ థాంక్స్''

సేతు సిప్ చేస్తూ తేరుకుంటూ అన్నాడు.

''నా మిత్రుడొకపుస్తకమిచ్చాడు. రిఫరెన్సుకోసం పేజీలు తిప్పి చూస్తున్నా. తమాషాగా ఆదిశేషయ్య అనేది ఇంగ్లీష్‌లో కంటబడింది. ఎక్సైటై పోయి యేమని అర్థం చెప్పాడోనని చదువుతూ పోతే ఆదిశేషు ఆదిత్య అనే పేర్లు హరివేనన్నాడు. పాము అని కాలాన్నీ అంటారన్నాడు. కాలమూ పాములాగే జరజరాపోతుందిట. ''సేతు నవ్వగలిగాడు. '' ఆదిశేషు డాక్టర్ని కలుసుకుంటే హరిని దర్శించిన ఆనందమే కలిగి వ్యథ తొలగిపోతుంది. నెహ్రూ పండితుడు ''బాపూ ఆశ్రమానికెళ్లి బాపూని దర్శించి వస్తే వ్యథలన్నీ మాయమౌతై'' అనేవారట.

సేతుని పరిశీలిస్తూ డాక్టరన్నాడు. ''వ్యథ తుడిచేసుకోటానికి వచ్చావాయేం సేతూ? చల్లని దేశంలో గూడా యిల్వలుని వారసులున్నారన్నమాట. లేదా యిక్కడ నించి వీసాల ద్వారా సరఫరా అయినారేమో అవి ఎడ్వాన్స్‌డ్ దేశాలనీ, వారంతా నాగరకులనీ అంటారే సేతూ'' అన్నాడు నవ్వుతూ. తానూ సిప్ చేస్తున్నాడు.

''మీరు వాడిన పదాలు నాకర్థంగాలేదు డాక్టర్! ఇల్వలుని వారసులంటే యెవరు?'' అనడిగాడు సేతు.

''నీవు మన పురాణగాథలు మరువలేదనుకుంటా. వాతాపీ యిల్వలుల కథ గుర్తుండాలే. కథ చిన్నదైనా శాశ్వతమైందే. అగస్త్యుని జీర్ణశక్తి తమబిడ్డలకు రావాలని తల్లులు వుగ్గుపెట్టి ''జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం'' అనటం ఆనవాయితీ అయింది మనకు''.

''అఫ్‌కోర్స్ డాక్టర్! మరిచిపోలేదు''.

''తమ్ముడు వాతాపిని మేక చేసి చంపి వండి వడ్డిస్తే అగస్త్య మహర్షి జీర్ణం చేసుకున్నాడని అర్థం కాగానే, 'వాతాపీ! వాతాపీ!' అని పిలిస్తే తమ్ముడు ఋషిని చంపి వాని పొట్ట చీల్చుకు రాలేదు మరి, వాని అన్న ఇల్వలుడు భయపడి ఐపులేకుండా పారిపోయాడు. బాటసారులకి మృత్యుపీడ వదిలింది. దేవుడు

దయాసింధు. ఇల్వలునికీ సంతాన మిచ్చాడు. వారంతా చెల్లాచెదరైనారు. త్రేతాయుగంలో జనస్థానంలో వైలెన్సు పెచ్చరిల్లినట్టుమనకూ దారుణ మారణ హత్యాకాండలూ వైలెన్సూ పెరిగిపోయాయి. దానిక్కారణం యిల్వలుని వారసులే. వారి ఆశయం, వైలెన్సును వృద్ధిచేసి, అహింసనూ అధర్మాన్నీ పైకితెచ్చి అరాచకం తేవటమే. వారికి హింస యిచ్చిన ఆనందం తృప్తీ, అహింస యివ్వటం లేదు. కుక్కిన పేనులల్లే వుండటంలో ఎక్సైట్‌మెంట్ యేదీ?''

''బాగా అర్ధమయేట్టు చెప్పారు డాక్టర్!'' సిప్ చేసి ఖాళీ చేసిన కప్పు బల్ల మీదుంచి కర్చీఫ్‌తో పెదిమలద్దుకున్నాడు సేతు''. నా సంగతెలా వూహించారు. చెప్పగలరు గూడానా?'' అన్నాడు వినోదిస్తూ.

''అఫ్‌కోర్స్ చెప్పగలననుకో సేతూ! మధ్య మధ్య వదిలేస్తే నీవా ఖాళీని నింపు. నాది వూహేగా''.

''అలాగే డాక్టర్. నేను చెప్పే బాధ తప్పింది'' అన్నాడు సేతు.

''మొదట్లో యెదురులేకుండా అడ్డంకులెరుగక జయిస్తూ వెళ్తూ అర్జన అనుకున్న పథకాలు పూర్తిచేస్తుంటే మైమరచి ప్రపంచమెంత సుందరమైనదీ, మిథ్య కాదు కనబడేది నిజమే, మోసమూ, వంచనా లేవు అనే భ్రమలో పడి ఒక స్త్రీ చెప్పినవన్నీ నమ్మి గృహస్తు జీవితం బెడదకాదని లాభసాటేనని గృహస్తువైనావు. కొద్దిరోజుల్లోనే పొగమంచు విడిపోయి భ్రమ కరిగిపోయి తీవ్రమైన యెండలాగా మిథ్యా ప్రపంచం హర్ట్ చేయసాగింది. సమ్మెటపోట్లు తాకుతున్నా, లెక్కచేయక ధైర్యంగా వుందుకే సాగిపోతుండగా యిల్వలుని వారసురాలు యీర్ష్యాసూయలు ప్రేరేపించగా, నిన్ను వంచించి బికారిని చేయాలని పథకం వేసింది. అమాయికత నటించి, సంఘానికి వెలి అయినట్టూ ఆదుకునే వారు లేనట్టు యింద్రజాలం చూపింది. ఇన్‌లా ఆదరించి గట్టెక్కించావు. ''నా కొద్దు. మీరు పెంచుకోండి. నేను జాబ్‌చేసుకోవాలి. బేబీ సిట్టింగెలా చేస్తాను? గుదిబండ అవుతాడు. పెంచటానికి నా రాబడి చాలదు. నేనింటి వద్ద వుండనైపాయె. మీకు స్వంత సంతు లేదు. పరాయి బిడ్డెందుకు? నేను యిన్‌లానేగా'' అని

తనకాపట్యానికి మలామా పూసి ఔదార్యమని చూపింది యిల్వలుని వారసురాలు. అంతకుత్సితమంత ముందెరగవు గనక జాలానికి వశమై ఆనందించావు. యెక్కువకాలం వ్యర్థం చేయక, యిల్వలుని వారసురాలు పథకం వేయించిన రెండో వారసుడు మందరలాగా పుట్టరేప్పట్టగా ''నేనే పెంచుకోగల స్తోమత వచ్చింది. బిడ్డనిచ్చేయమన్నది''. మంచు విడిపోయి యెండ తీవ్రమైనట్టు పౌరుషం పట్టుదలా పటిమా గట్టిగా పట్టుకోగా న్యాయస్థానికెళ్లి యిల్వలుని వారసురాలు పథకం వేసి యేమి చేసిందో చెప్పావు. చిలికి చిలికి గాలివానై, అంతా కోల్పోయి, ఋణమనే వూబిలోకి కూరుకుపోయాకపథకమంతా అర్థమై నిన్నేమి చేయదలచి యీ నాటకమాడింది యిల్వలుని వారసురాలు అర్థమై, పరమాత్మ విశ్వరూపం చూసినట్టై, భ్రమ తొలగి, ప్రమాదం గుర్తించి, మిథ్యా ప్రపంచం అర్థమై, సత్యమనే దైవాన్ని చూచావు గనక భయపడలేదు'' అని తానూ కప్పు కింద వుంచాడు శేషయ్య. సేతు చప్పట్లు కొట్టి నవ్వాడు '' కరెక్ట్. మీ వూహాజ్ఞానం గొప్పది. యెలా వూహించ గలిగారో తెలుసుకోవాలి'' అన్నాడు.

''లైఫ్ స్టైల్ ఎబ్రాడ్ అనే ఆర్టికల్ చదివాను సేతూ. ముందు హుక్ చేసి బురిడీ వేసి, ఆల్టర్ వద్దకు లాక్కెళ్లి పని పూర్తి చేయించి, తర్వాత విడాకుల వేపు లాగి లా ప్రకారం బికారిని చేసి వదిలేస్తారు. లా కనబడినంత హెల్ప్‌ఫుల్‌గా ధర్మం కనబడదు యిల్వలుని వారసులకి. బికారికి స్వదేశం గుర్తు వచ్చినా, పంతానికి యేదో చేతాం లెమ్మని గుణపాఠం నేర్చుకుని అక్కడే వుండాలనుకుంటాడు. జీతాలు అయస్కాంతాలలాగా లాగుతాయి. టెమ్ట్ చేస్తాయి. ఒక నటుడిది వివరించాడు'' అంటూ నవ్వుతూ తాళం తిప్పి సొరుగులాగి ఒక పోలరాయిడ్ చిత్రం, మరోటి కంప్యూటర్ ద్వారా పెద్దది చేసినదీ అందించాడు సేతురాముకి.

'' ఆ యువతి పేరు సర్పలత. టూరిజంలో జాబ్ సంపాయించబోతూ హెల్త్ సర్టిఫికేట్ కోసం మరియు కన్సల్టేషన్ కోసమూ వచ్చింది. రిపోర్టులో ఆమె రక్తంలో యిల్వలుని రక్తదోషమున్నదని తెలిసీ సంతకం పెట్టి యిచ్చేశాను. జాబూ

కొట్టింది సర్పలత'' అన్నాడు డాక్టర్. సేతురాము కళ్లు పెద్దవై కనుబొమ్మలు పైకిపోయినై.

''అరె! డాక్టర్! నా మీద జాలం విసిరి బికారిని చేసిన, మీరన్నట్టు యిల్వాలుని వారసురాలు యిలాగే వుంటుంది అదే జాబ్'' అన్నాడాశ్చర్యపోయి.

''మనిషిని పోలిన మనిషి వున్నట్టే, స్వభావాన్ని పోలిన స్వభావం గలవారూ వుంటారు సేతూ. ఆ స్వభావాన్నీ గుర్తు పడతాము. నేను వూహించనూ లేదు, కల్పించనూ లేదు. ఫాబ్రికేటూ చేయలేదు. కొంత సర్పలత ఎకాంప్లిస్, వాడే లవ్వర్‌మాన్, డంబాలు పలుకుతూ చెప్పాడు. వాడూ యిల్వాలుని వారసుడే. ఎలా అల్లరిపెట్టాలో యెలా హర్ట్ చేయాలో, యెలా మీన్‌గా మారాలో చెప్పాడుట. వాడు జాబ్ పోయినా కట్టడానికి సూపర్‌వైజర్‌గా వచ్చాడు. తర్వాత బెంగుళూరులో జాబ్ వచ్చిందని చెప్పి వెళ్ళిపోయాడు. కొంత అక్కడక్కడ లాయర్ ఫ్రెండ్స్ చెప్పారు. మరికొంత మేస్త్రీ దేవుడమ్మ చెప్పాడు. అధర్మానికెలా వెరవరో చెప్పాడు''.

బాగా తెప్పరిల్లిన సేతురాము అడిగాడు.

''నర్సింగ్‌హోమ్ పూర్తయిందా డాక్టర్? స్టార్ట్ చేశారా?''

'' ఆ. ఆ. దైవకృపవల్ల పూర్తయింది. స్టార్ట్ చేశాను సేతూ. కాని అంచనాకు మించి పోయింది. కోటివరకు వెళ్లింది. పరికరాలు, బెడ్స్, వర్కర్స్, స్టాఫ్. బోర్‌వెల్ ఇపుడు మెయింటెయిన్ చేయాలిహ'' అన్నాడు శేషయ్య.

''కంగ్రాచ్యులేషన్స్ డాక్టర్. యెన్ని అవాంతరాలొచ్చినా సక్సెస్ చూడగానే అన్నీ మరిచిపోతామన్నాడో రచయిత. నమస్తే. మళ్లా కలుసుకుందాం'' అని లేచాడు సేతురాము.

లంచ్ టైమైందని గోడగడియారం చెప్పింది.